# నగరాభివృద్ధికి మరో వంద కోట్లు

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో ప్రగతిపథంలో వరంగల్
- హనుమకొండ బస్‌స్టేషన్‌ను ఆధునీకరిస్తాం
- తహసీల్దార్ ఆఫీస్‌కు అనువైన స్థలాన్ని గుర్తిస్తున్నాం
- పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- ఖాళీ బాటిళ్లను డ్రైనేజీల్లో వేయొద్దు
- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి లోతట్టు ప్రాంతాల పరిశీలన
- వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం



హనుమకొండ బస్‌స్టేషన్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూలై 22 : ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చొరవతో నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇంకా వంద కోట్లతో నగరాభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నాలుగు రోజులుగా నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఇతర అధికారులతో కలిసి ఆయన హనుమకొండ బస్టాండ్, యూత్ హాస్టల్, ఆర్డీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీసులను సందర్శించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా హనుమకొండ బస్‌స్టేషన్‌లో వర్షం నీరు చేరి, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో కలిసి సమస్యని పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, కుడా చైర్మన్, ఇతర అధికారులతో కలిసి ఆర్డీవో ఆఫీస్, యువత వసతి గృహం, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని తాత్కాలికంగా ఇతర ప్రదేశానికి మార్చడం కోసం పలు భవనాలను సందర్శించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆఫీస్‌కు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, వర్షం నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు తెగడం, పాత గోడలు కూలడం వంటి ప్రమాదాలు ముందుగా పసిగట్టాలని, ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షించాలని వినయ్‌భాస్కర్ ఆదేశించారు.

**హనుమకొండ బస్‌స్టేషన్‌ను ఆధునీకరిస్తాం..**

హనుమకొండ బస్‌స్టేషన్‌ను అన్నివిధాలుగా ఉపయోగపడేలా ఆధునీకరిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. బస్‌స్టేషన్‌లో వర్షపు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్‌లో నుంచి వచ్చే మురుగుకాల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. బస్‌స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు మురుగుకాల్వల్లో పడేయడంతో ఎక్కడికక్కడే డ్రైనేజీలో పేరుకుపోయిన వర్షపు నీళ్లు రోడ్డుపైకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఈవీఎం, వీవీప్యాడ్ కేంద్రం సందర్శన**

హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన కల్పించే కేంద్రాన్ని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సందర్శించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల్లో ప్రజలకు ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలనే కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు నియోజకవర్గానికి ఒక ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్డీవో కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు కూడా ఓటు వేయడంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశామని చీఫ్ విప్ వినయ్‌భాస్కర్‌కు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ కరుణాకర్‌రెడ్డి తదితరులు

## రీసెర్చ్‌తోనే ఉత్తమ ఫలితాలు

- పరిశీలన, పరిశోధనలతో మానవ మనుగడ సాధ్యం
- కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి
- వర్సిటీలో కేఆర్‌డీ-23 రీసెర్చ్ డే వేడుకలు
- వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

వరంగల్ చౌరస్తా, జూలై 22 : వైద్య రంగంలో స్వయం పరిశీలన, రీసెర్చ్‌ల ద్వారానే ఉత్తమ ఫలితాలను సాధించడం సాధ్యమవుతుందని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. కేఆర్‌డీ-23 పేరుతో కాకతీయ మెడికల్ కళాశాలలో అలుమ్ని(కేఎంసీ పూర్వ విద్యార్థుల అసోసియేషన్) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రీసెర్చ్‌డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశం సమశీతోష్ణస్థితి కలిగి ఉండడం, అధిక జనాభా ఉండడం వల్ల మానవులకు సంక్రమించే అన్ని రకాల వ్యాధుల వివరాలను సేకరించి, పరిశోధన చేయడం సులభమన్నారు. అందుకే ఇతర దేశాల వైద్యవిద్యార్థులు మన దేశంలో పరిశోధనలు చేయడానికి వస్తున్నారన్నారు. వైద్యరంగంలో రాణించాలనుకునే వారు ఇప్పటి నుంచే మానవుడి జీవితంలో సంక్రమించే వ్యాధులపై పరిశోధనా ధోరణిని అలవాటు చేసుకోవాలన్నారు. వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు, మనిషిపై పడే ప్రభావం లాంటి అంశాలను పరిశీలించడం వల్ల వ్యాధి నివారణకు తక్కువ సమయంలోనే పరిష్కారాన్ని కనుక్కోవచ్చునన్నారు. ప్రతి వైద్య విద్యార్థి నిత్య విద్యాబోధనలో పరిశీలన, పరిశోధనను అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. అనంతరం కాకతీయ రీసెర్చ్ డే పేరుతో ఏర్పాటు చేసిన క్రానికల్‌ను ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో ప్రతి మూడు నెలలకు ఒక క్రానికల్‌ని రూపొందించేలా విద్యార్థులకు ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. తెలంగాణలో కాకతీయ మెడికల్ కళాశాల విద్యాబోధన రంగాన్ని పటిష్టం చేయడానికి, ఉత్తమ ర్యాకింగ్‌లో నిలుపడానికి అలుమ్ని చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. కళాశాల విద్యార్థుల కోసం అమెరికాలో స్థిరపడిన వైద్యులతో ఆయా విభాగాల వారీగా ఆన్‌లైన్ విధానంలో నెలలో మూడో శనివారం తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న అంశాల్లో రీసెర్చ్ చేసి తమ ఆలోచనలు, వారి పరిశీలనలను తోటి విద్యార్థులతో పంచుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ప్రతి విద్యాసంవత్సరం నిర్వహించాలని తీర్మానించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు విద్యార్థులను ఉద్దేశించి తమ సలహాలు, సూచనలు అందించారు. అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు రీసెర్చ్ విభాగంలో తమ అనుభవాలను వివరించారు. కాగా, విద్యార్థులను నాలుగు విభాగాలుగా ఏర్పాటు చేసి, వైద్యరంగానికి సంబంధించిన ప్రశ్నలతో క్విజ్, డిబెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేఎంసీతో పాటు దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల నుంచి సుమారు 50 మంది పాల్గొన్నారు.

## జలాశయాలకు జలకళ

**మత్తడి పోస్తున్న చెరువులు, కుంటలు**

జయశంకర్ భూపాలపల్లి, జూలై 22 (నమస్తే తెలంగాణ) : ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం భూపాలపల్లి జిల్లాలోని పలు మండలాల్లో గెరువివ్వగా, కొన్ని మండలాల్లో పడుతూనే ఉంది. గోదావరి, ప్రాణహిత నదుల ప్రవాహంతో కాళేశ్వరం వద్ద గోదావరి శనివారం సాయంత్రం 4 గంటల వరకు 11.36 మీటర్ల ఎత్తులో 6.50 లక్షల క్యూసెక్కుల నీటితో ప్రవహిస్తున్నది. రాత్రి వరకు పెరిగే అవకాశం ఉంది. లక్ష్మీ బరాజ్ 75 గేట్లు, సరస్వతి బరాజ్ 55 గేట్లు ఎత్తి నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

**నీటిమట్టాలు ఇలా ..**

భీంఘన్‌పూర్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 385 మిలియన్ క్యూబిక్ ఫీట్లు (ఎంసీఎఫ్‌టీ) కాగా, 223.88 ఎంసీఎఫ్‌టీలు ఉన్నాయి. బొగ్గుల వాగు ప్రాజెక్టులో సామర్థ్యం 406.56 ఎంసీఎఫ్‌టీలు కాగా, 117.65 ఎంసీఎఫ్‌టీ లు, నర్సింగపూర్ రిజర్వాయర్ సామర్థ్యం 50 ఎంసీఎఫ్‌టీలు కాగా, ప్రస్తుతం 42 ఎంసీఎఫ్‌టీలు ఉన్నాయి. అలాగే, గణప సముద్రం సామర్థ్యం 1478.34 ఎంసీఎఫ్‌టీలు కాగా, 467.90 ఎంసీఎఫ్‌టీలకు చేరినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

**ఓపెన్‌కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం**

భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీపీ-1, కేటీకే ఓసీపీ-2 గనుల్లో శనివారం కూడా బొగ్గు ఉత్పత్తి పునఃప్రారంభం కాలేదు. దీంతో ఆరు రోజులుగా రెండు గనుల్లో 40,100 టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. రూ.8.82 కోట్ల మేర బొగ్గు ఉత్పత్తి రూపేణా సింగరేణి సంస్థకు నష్టం వాటిల్లినట్లు సింగరేణి అధికార వర్గాలు వెల్లడించాయి.

## శిథిల భవనాల తొలగింపులో వేగం పెంచాలి

**గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా**



టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతన్న కమిషనర్

వరంగల్, జూలై 22 : నగరంలో వర్షాల నేపథ్యంలో ప్రమాదంగా మారిన శిథిలావస్థలో ఉన్న భవనాల కూల్చివేతలలో వేగం పెంచాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో శిథిలావస్థలో ఉన్న భవనాల సమాచారం తెలుసుకునేందుకు ఆర్పీ, జవాన్లతో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివాసం ఉన్న వారికి కార్పొరేషన్ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో పునరావాసం కల్పించాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాల్లో నివాసం ఉంటున్న వారిని స్థానిక కార్పొరేటర్ల సహకారంతో ఖాళీ చేయించాలని సూచించారు. సమావేశంలో సిటీ ప్లానర్ వెంకన్న, డీఎఫ్‌వో శంకరలింగం, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, టీపీబీవోలు పాల్గొన్నారు.

**ఓటర్లలో చైతన్యం పెంపొందించాలి**

ఓటు వినియోగంపై ఓటర్లలో చైతన్యం పెంపొందించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆయన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటుకు సంబంధించిన అంశాలైన ఫిర్యాదుల పరిష్కారానికి ఈ నెల 27 చివరి గడువని, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఓటు విలువపై విస్తృత ప్రచారం చేసి, ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చి, పోలింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించేందుకు బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. క్షేత్రస్థాయిలో మొబైల్ వాహనం కూడా ఏర్పాటు చేశామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైన కేంద్రాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ పోలింగ్ అయ్యేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల డీటీ రవి తదితరులు పాల్గొన్నారు.



## లక్నవరం కళకళ

*పర్యాటక ప్రాంతమైన లక్నవరం సరస్సుకు జలకళ సంతరించుకుంది. శనివారం సాయంత్రానికి 27 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. మరో 6.5అడుగుల నీరు చేరితే మత్తడి పోయనుంది. పర్యాటకుల రద్దీ పెరగనున్నందున టూరిజం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.*

- గోవిందరావుపేట, జూలై 22